సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 16 । మార్చి । 2023



విజిలెన్స్ దాడి

గుండుగొలనులోని రైస్‌మిల్లుపై విజిలెన్స్, పౌరసరఫరాల విభాగం అధికారులు దాడి చేసి 73.95 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. – 8లో ▸



సత్వర పరిష్కారానికి కృషి

రాజీపడదగిన కేసుల సత్వర పరిష్కారానికి లీగల్ సర్వీస్ అథారిటీ కృషి చేస్తుందని శాశ్వత లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి అన్నారు. – 8లో ▸

మలిచే పద్ధతే 'వేరు'



వేరుశనగ పంట కోత పూర్తయ్యాక జాగ్రత్తలు తీసుకుంటేనే విత్తనాలు నాణ్యంగా ఉంటాయి. లేకుంటే పుచ్చు పట్టి పనికి రాకుండా పోతాయి. –8లో

న్యూస్‌రీల్

పోలీస్ కుటుంబాలకు కంప్యూటర్ శిక్షణ



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: పోలీస్ సిబ్బంది కుటుంబాల్లోని విద్యార్థులకు కంప్యూటర్ బేసిక్స్ నుంచి అడ్వాన్స్ స్థాయి వరకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ బుధవారం ప్రారంభించారు. కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు వీలుగా శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశామన్నారు. పదో తరగతి వరకు విద్యనభ్యసించిన విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ ఆఫీస్, డీసీఏ, ఇంగ్లిష్ టైపింగ్ వంటి అంశాలపై, డిగ్రీ స్థాయి విద్యార్థులకు అడ్వాన్స్ టెక్నాలజీలో సీ, సీ++, జావా, ఒరాకిల్, పైతాన్, నెట్, హెచ్‌టీఎంఎల్, జావా స్క్రిప్ట్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తారన్నారు. తొలిబ్యాచ్‌గా 20 మందికి శిక్షణ మొదలైంది. ఏఆర్ డీఎస్పీ ఎంవీవీ సత్యనారాయణ, ఆర్‌ఐ శ్రీకాంత్, ఆర్ఎస్‌ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

18న రాష్ట్ర సమావేశాలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మెడికల్ రిప్రజెంటేటివ్స్ సంఘు నాయకులు

సాక్షి, భీమవరం: రాష్ట్ర మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఈనెల 18,19 తేదీల్లో భీమవరం టౌన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.దక్షిణామూర్తి తెలిపారు. బుధవారం ఆయన భీమవరంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. సభ్యుల ఉద్యోగ భద్రతతో పాటు వైద్య, ఆరోగ్య రంగంలో సమస్యలపై పోరాడుతున్నామన్నారు. ఈ మేరకు సమావేశాల్లో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ప్రభుత్వ రంగ ఫార్మా కంపెనీలను పునరుద్ధరించాలని, మందులు, వైద్య పరికరాలపై జీఎస్టీని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎస్.శిరీష్‌కుమార్, భీమవరం శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.శ్రీనివాస్, కేఎం సూర్యచంద్రరాజు, కోశాధికారి జి.నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.


ఎట్టకేలకు జగన్నాథపురం సర్పంచ్‌గా చంద్రిక



బాధ్యతలు స్వీకరించిన చంద్రికను అభినందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఎట్టకేలకు జగన్నాథపురం సర్పంచ్‌గా ఉండ్రాజవరపు చంద్రిక ఎన్నికయ్యారు. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పానుకుమాటి గౌరీ సర్పంచ్‌గా ఎన్నికైనట్లు అప్పటి ఎన్నికల అధికారి ప్రకటించారు. దీనిపై అప్పట్లో చంద్రిక కోర్టును ఆశ్రయించారు. రెండేళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం కోర్టు తుది తీర్పు వెలువరించింది. చంద్రికకు మెజార్టీ ఉందని కోర్టు స్పష్టం చేసింది. తీర్పు నివేదికను కలెక్టర్‌కు పంపించారు. కలెక్టరేట్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు బుధవారం తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి ఎంపీడీఓ వీఎస్ వేణుగోపాల్ ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీపీ పానుకుమాటి శేషులత, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, వెలిశెట్టి నరేంద్రకుమార్, సొసైటీ అధ్యక్షుడు చిక్కాల సత్యనారాయణ తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు.

22 రోజులు.. రూ.1.83 కోట్లు



ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో బుధవారం చినవెంకన్న హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 22 రోజులకు నగదు రూపంలో రూ.1,83,76,847 ఆదాయం లభించినట్టు ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. కానుకల రూపంలో 266 గ్రాముల బంగారం, 5.518 కిలోల వెండితో పాటు అధికంగా విదేశీ కరెన్సీ లభించాయన్నారు.

గెలుపు లాంఛనమే

- వైఎస్సార్ సీపీ అభ్యర్థులకే విజయావకాశాలు
- నేడు ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్
- 1,088 ఓట్ల లెక్కింపునకు 5 టేబుళ్లు
- ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో సర్వం సిద్ధం
- బరిలో నలుగురు స్వతంత్రులు



ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

సాక్షి ప్రతినిధి,ఏలూరు: స్థానిక సంస్థల కోటాలోని శాసనమండలి సభ్యుల ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సర్వం సన్నద్ధమైంది. గురువారం ఏలూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. రెండు శాసనమండలి స్థానాలకుగానూ ఎన్నికల ప్రక్రియ నిర్వహించగా అధికార వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు లాంఛనంగా మారనుంది. ఉదయం 8 గంటలకు ఐదు టేబుళ్ల ద్వారా 1,088 ఓట్లను లెక్కించి విజేతలను ప్రకటించి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు.

తుది అంకానికి ప్రక్రియ

శాసనమండలి సభ్యుల ఎన్నికల ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. కౌంటింగ్ ప్రక్రియతో ఎన్నికల షెడ్యూల్ ముగుస్తుంది. ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబు నేతృత్వంలో కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేష్, జాయింట్ కలెక్టర్ అరుణ్‌బాబు ఏర్పాట్లను పరిశీలించారు. మొత్తం 5 టేబుళ్ల ద్వారా 1,088 ఓట్లు లెక్కించనున్నారు. 1,088 ఓట్లు చెల్లుబాటు అయితే 366 ఓట్లు వచ్చిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. అలా ఇద్దరు అభ్యర్థుల మెజార్టీ చూసి దానికనుగుణంగా విజేతలను ప్రకటిస్తారు. వాస్తవానికి అధికార పార్టీ గెలుపు లాంఛనం కానుంది.

ప్రతిపక్షాల అనైతిక పొత్తులు

తొలుత తెలుగుదేశం పార్టీ పోటీకి దూరమంటూ కేడర్‌కు పరోక్ష సంకేతాలు ఇచ్చి చివరి నిమిషంలో బలం లేనప్పటికీ జనసేనతో అనైతికపొత్తులకు తెరదీసి నలుగురు అభ్యర్థులను స్వతంత్రులుగా బరిలో దింపారు. వీరిలో వీరవాసరానికి చెందిన టీడీపీ మండల నాయకుడు వీరవల్లి చంద్రశేఖర్‌ను పార్టీ అభ్యర్థిగా తెలుగుదేశం అన్ని నియోజకవర్గాల్లో పరిచయం చేసింది. ఇక జనసేన కూడా మండలాల వారీగా మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది. టీడీపీ, జనసేనకు కలిపి కనీసం 200 ఓట్లు కూడా లేవు. గెలుపొందాలంటే కనీసం 366 ఓట్లు తప్పనిసరి. సభ్యులను ఏకగ్రీవం కాకుండా చేయడానికే స్వతంత్రులతో నామినేషన్లు వేయించి ఎన్నిక అనివార్యం చేశారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా..

వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా జెడ్పీ ఛైర్మన్ కవురు శ్రీనివాస్, పార్టీ నేత వంక రవీంద్రనాథ్ బరిలో నిలిచి జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. రెండు స్థానాలు కావడంతో మండలాలను ప్రామాణికంగా తీసుకుని ఇద్దరు అభ్యర్థులు చెరో సగం మండలాల్లో పార్టీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. దానికనుగుణంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

సర్వ సన్నద్ధం



పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి అరుణ్‌బాబు

ఏలూరు(మెట్రో): జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబు తెలిపారు. బుధవారం వారు కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. ఉదయం 7 గంటలకు ఎన్నికల పరిశీలకులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్ తెరిచి 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తామన్నారు. ఎన్నికల సిబ్బందితో పాటు, ఆయా అభ్యర్థుల ఏజెంట్లు కూడా కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తారన్నారు. మొదట కౌంటింగ్ టేబుళ్ల వద్ద లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని, తదుపరి రిటర్నింగ్ అధికారి టేబుల్ వద్ద నిర్వహిస్తారన్నారు. రిటర్నింగ్ అధికారి టేబుల్ వద్ద అభ్యర్థులు, వారి ఏజెంట్లు ఉంటారని, కౌంటింగ్ టేబుల్స్ వద్ద కౌంటింగ్ ఏజెంట్లు ఉంటారనన్నారు. ఎన్నికల సంఘం రూపొందించిన నియమ నిబంధనలపై ఇప్పటికే సిబ్బందికి రెండుసార్లు శిక్షణ ఇచ్చామన్నారు. కౌంటింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్డీఓ పెంచెల కిషోర్, డీఆర్డీఏ పీడీ విజయరాజు, వ్యవసాయ శాఖ జేడీ వై.రామకృష్ణ, ఏలూరు తహసీల్దార్ సోమశేఖర్ ఉన్నారు.

సాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో పంట పొలాలకు సాగునీటిని సక్రమంగా అందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నీటిపారుదల శాఖ అధికారులతో ఆమె సమీక్షించారు. ఇప్పటివరకూ నాలుగు తడులకు నీరందించామని, ఐదో తడికి సరఫరా చేయాలన్నారు. మంచి నీటితో చేపలు, రొయ్యలు సాగుచేస్తున్న ప్రాంతాలపై దృష్టి పెట్టి మోటార్ల ద్వారా నీటి చౌర్యానికి పాల్పడితే కట్టడి చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకూ 70 ఆయిల్ ఇంజన్లను సీజ్ చేశామన్నారు. క్రాస్ బండ్ల పనులు జరుగుతున్నాయని, కాలువల్లో కర్రనాచు తొలగింపు పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ప్రతి ఎకరాకూ నీరందించాలని ఆదేశించారు. జిల్లా నీటిపారుదల శాఖ అధికారి పి.నాగార్జునరావు, ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

ఉపాధి హామీ పథకంలో ప్రతి మండలంలో రోజుకు 1,200 నుంచి 1,500 మంది వరకు కూలీలకు పనులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి పనులపై డ్వామా అధికారులతో ఆమె సమీక్షించారు. కూలీలందరికీ ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేయాలన్నారు. జిల్లాలో 80 చోట్ల అమృత్ సరోవర్ పథకంలో పనులు చేపట్టగా 33 చెరువుల పనులు పురోగతిలో ఉన్నాయని, 4 పనులు పూర్తయ్యాయన్నారు. ఉపాధి హామీ పథకంలో జిల్లా వెనుకబడి ఉందని, వచ్చే వారం నాటికి ప్రగతి సాధించకపోతే సంబంధిత ఏపీడీలను సరెండర్ చేస్తామని హెచ్చరించారు. ఏ గ్రామ పంచాయతీలో పనులు ప్రారంభించకుంటే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించి కొత్తవారిని నియమిస్తామన్నారు. అర్హులందరికీ జాబ్ కార్డులు జారీ చేయాలని ఆదేశించారు. మనుగడలో లేని జాబ్ కార్డులను తొలగించి, ఎస్సీ/ఎస్టీ కుటుంబాలకు ఎక్కువ పనిదినాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు.

హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఆర్డీఓ రాజు

సాక్షి, భీమవరం: వస్తువుల నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర వంటి వాటిపై వినియోగదారులకు అవగాహన కలిగించడం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం ముఖ్య ఉద్దేశమని భీమవరం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాణ్యమైన సేవలు పొందే సమాచారాన్ని తెలుసుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని వస్తువులు, సేవలు పొందే సమయంలో వాటి మధ్య ధరల వ్యత్యాసాన్ని వినియోగదారులు తెలుసుకోవాలన్నారు. వినియోగదారులు మోసానికి గురైనప్పుడు ఫోరంలో కేసులు వేసి పరిహారం పొందాలన్నారు. అనంతరం వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య రూపొందించిన కరపత్రాలను ఆర్డీఓ ఆవిష్కరించారు. సివిల్ సప్లయిస్ జిల్లా అధికారి ఎస్.సరోజ, జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, తూనికలు, కొలతలు శాఖ సహాయ కమిషనర్ వీవీ నాగరాజారావు, జిల్లా వినియోగదారుల సంఘం ఉపాధ్యక్షుడు మేళం దుర్గాప్రసాద్, జి.గోపాలకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు ప్రశాంతం
- 96 శాతం హాజరు నమోదు



చిన అమిరంలోని పరీక్షా కేంద్రంలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



తాడేపల్లిగూడెంలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

సాక్షి, భీమవరం: జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో 52 కేంద్రాలను ఏర్పాటుచేయగా తొలిరోజు 96 శాతం విద్యార్థులు హాజరయ్యారు. 15,268 మంది రెగ్యులర్ విద్యార్థులకు 14,819 మంది హాజరు కాగా 449 మంది గైర్హాజరయ్యారు. 1,644 మంది ఒకేషనల్ విద్యార్థులకు1,437 మంది హాజరు కాగా.. 207 మంది గైర్హాజరయ్యారు. భీమవరం మండలం చినఅమిరంలోని శ్రీ చైతన్య కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎక్కడా మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి స్వయంగా పర్యవేక్షిస్తున్నామన్నారు. కేంద్రాల వద్ద విద్యుత్, తాగునీటి సదుపాయాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆమె తహసీల్దార్ వైవీ రవికుమార్ ఉన్నారు.

రాష్ట్రపతిని కలిసిన ఎంపీ కోటగిరి



రాష్ట్రపతిని కలిసిన ఎంపీలు శ్రీధర్, బోస్

దెందులూరు: ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో బుధవారం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు.

రైల్వేస్టేషన్‌లో వ్యక్తి మృతి




యశోదకుమార్ మృతదేహం

పాలకొల్లు సెంట్రల్: హైదరాబాద్ వెళ్లేందుకు పాలకొల్లు రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందారు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం పాలకొల్లు మండలం గోరింటాడకి చెందిన చెల్లుబోయిన యశోదకుమార్ (43) నరసాపురం నుంచి సికింద్రాబాద్ వెళ్లే రైలు ఎక్కేందుకు పాలకొల్లు స్టేషన్‌కు వచ్చారు. రెండు బ్యాగులు పట్టుకుని ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎక్కి ప్లాట్‌ఫారం–2కు వెళుతుండగా గుండెపోటుతో కుప్పకూలి పడిపోయారు. తోటి ప్రయాణికులు 108కు సమాచారం ఇవ్వగా.. హుటాహుటిన వచ్చి పరీక్షించి యశోదకుమార్ మృతిచెందినట్టు నిర్ధారించారు. మృతుడు హైదరాబాద్‌లో ప్రింటింగ్ ప్రెస్ పనిచేస్తుంటారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మూడు రోజుల క్రితం తల్లిదండ్రులను చూడటానికి స్వగ్రామం వచ్చారు. రైల్వే పోలీసులు సాధారణ మృతిగా గుర్తించి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యాటకాభివృద్ధికి ప్రాధాన్యం

- ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- గోదావరి పరీవాహక ప్రాంతాల్లో రిసార్ట్స్, బోటింగ్ ఏర్పాట్లు
- రూ.20 లక్షలతో పేరుపాలెం బీచ్‌లో వసతులు
- జాతీయ రహదారిని ఆనుకుని రెస్టారెంట్లు, విశ్రాంతి గదులు



పేరుపాలెం బీచ్



సిద్ధాంతంలో పర్యాటక శాఖ నిర్వహిస్తున్న సన్‌రైజ్ రిసార్ట్

భీమవరం(ప్రకాశం చౌక్): తూర్పున గోదావరి.. ఉత్తరాన జాతీయ రహదారి.. పడమరన ఉప్పుటేరు.. దక్షిణంలో సముద్రంతో పచ్చటి పొలాలు, ప్రసిద్ధ ఆలయాలతో పర్యాటకంగా విస్తృత అవకాశాలు ఉన్న ప్రాంతం పశ్చిమగోదావరి జిల్లా. అయితే జిల్లాలో టూరిజం అభివృద్ధి అంతంతమాత్రంగానే ఉంది. నదీ పరీవాహక ప్రాంతాలతో పాటు సముద్ర తీరంలో విహారానికి పర్యాటకులు వస్తున్నా ఆశించిన స్థాయిలో వసతులు లేవు. ఈ నేపథ్యంలో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేలా వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలో పర్యాటక అభివృద్ధిపై కలెక్టర్ పి.ప్రశాంతి శ్రద్ధ చూపుతూ పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. పర్యాటకులను ఆకట్టుకునేలా వసతులు, సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు.

అతిథి గృహం.. పూర్వవైభవం

ఆచంట మండలం పెదమల్లంలోని వశిష్ట గోదావరి తీరాన ఉన్న పర్యాటక అతిథి గృహం అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇక్కడ విద్యుత్, తాగునీటితో పాటు మౌలిక వసతులు పునరుద్ధరించనున్నారు. అలాగే వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటుచేయనున్నారు. పర్యాటకులకు ఆహ్లాదంతో పాటు చక్కటి ఆరోగ్య అలవాట్లు కలిగించేలా గైడ్ చేసేలా కార్యక్రమం రూపొందిస్తున్నారు. దీంతోపాటు గోదావరిలో బోటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

మరింత 'అల'రించేలా..

మొగల్తూరు మండలంలోని పేరుపాలెం బీచ్‌కు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. ఇక్కడ పర్యాటకులు సేదతీరడానికి షెడ్లు, లైటింగ్, మరుగుదొడ్లు మరిన్ని వసతుల కల్పనకు పర్యాటక శాఖ అధికారులు రూ.20 లక్షలకు ప్రతిపాదనలు చేస్తున్నారు.

హైవే వెంబడి టూరిజం ప్రాజెక్ట్ : నరసాపురం నుంచి మొగల్తూరు, ముత్యాలపల్లి మీదుగా జాతీయ రహదారి వెంబడి టూరిజం ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రెస్టారెంట్లు, రెస్ట్‌రూమ్స్ వంటివి ఏర్పాటుచేయనున్నారు. పర్యాటకులతో పాటు దూర ప్రాంతాలకు ప్రయాణించే వారు సేదతీరేలా సౌకర్యాలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

అనుకూల ప్రాంతాలను గుర్తించి..

వశిష్ట గోదావరి పరీవాహక మండలాలుగా ఉన్న ఆచంట, యలమంచిలి, పాలకొల్లు, నరసాపురం, పెనుగొండ మండలాల్లో పర్యాటకానికి అనుకూల ప్రాంతాలను గుర్తించి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసే పనిలో టూరిజం, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

సన్‌రైజ్ రిసార్ట్

పెనుగొండ మండలం సిద్ధాంతంలో సన్‌రైజ్ పేరిట రిసార్ట్‌ను పర్యాటక శాఖ నడుపుతోంది. ఇక్కడ 16 గదులు, కాన్ఫరెన్స్ హాల్, రెస్టారెంట్, స్విమింగ్ పూల్ తదితర సౌకర్యాలు ఉన్నాయి.

ప్రత్యేక శ్రద్ధతో..



జిల్లాలో పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. పర్యాటకులు ఆహ్లాదంగా గడపటంతో పాటు గోదావరి, సముద్ర తీర ప్రాంతాల్లో సేద తీరేలా ఏర్పాట్లు చేస్తున్నాం. గోదావరితో పాటు మొగల్తూరు, భీమవరం తదితర ప్రాంతాల్లోని ఇరిగేషన్ కాలువల్లో కూడా బోటింగ్‌కు చర్యలు తీసుకున్నాం. అలాగే పేరుపాలెం బీచ్, పెదమల్లం అతిథి గృహం వద్ద మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

– పి.ప్రశాంతి, కలెక్టర్

బోటింగ్‌తో సరికొత్త అందాలు

వశిష్ట గోదావరిలో పలు ప్రాంతాల్లో బోటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆచంట మండలం పెదమల్లం, యలమంచిలి మండలంలో అనుకూల ప్రాంతం, దొంగరావిపాలెం, నరసాపురంలోని వలంధర రేవులో బోటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే సిద్ధాంతంలోని సన్‌రైజ్ రిసార్ట్ వద్ద బోటింగ్‌ను పునరుద్ధరించనున్నారు. మొగల్తూరు, భీమవరం ఇరిగేషన్ కాలువల్లో కూడా బోటింగ్‌కు ఏర్పాట్లు చేయనున్నారు.

క్లుప్తంగా

సెబ్ దాడుల్లో నలుగురి అరెస్టు



నిందితులను అరెస్టు చేసిన సెబ్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ

నూజివీడు: స్థానిక సెబ్ స్టేషన్ పరిధిలోని చాట్రాయి మండలంలో బుధవారం దాడులు నిర్వహించి సారా, తెలంగాణ మద్యం కలిగి ఉన్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ టీ గోపాలకృష్ణ చెప్పారు. చిన్నంపేటకు చెందిన పరసా నాగేశ్వరరావును అరెస్టు చేసి అతని నుంచి ఐదు లీటర్ల సారా, కోటపాడులో దాడులు చేసి పజ్జూరి చెన్నారావు నుంచి తెలంగాణకు చెందిన 23 బీర్లు, మల్లెల రామచంద్రరావు వద్ద తెలంగాణకు చెందిన 5 బీర్లు, షేక్ బాజీబాబా వద్ద తెలంగాణకు చెందిన నాలుగు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నలుగురి నిందితులను అరెస్టు చేశామన్నారు. అనంతరం వీరిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ అంటే విధించినట్లు తెలిపారు.

విత్తనంగా మలిచే పద్ధతే 'వేరు'

వేరుశనగ పంట చేతికొచ్చే దశలో జాగ్రత్తలు తప్పనిసరి

పాడి - పంట

చింతలపూడి: దేశంలో పండించే నూనె గింజల పంటల్లో వేరుశనగ అతి ముఖ్యమైనది. ప్రాచీనకాలం నుంచి వేరుశనగ నూనెను వంటల్లో ఉపయోగిస్తున్నారు. వేరుశనగ పంట కోత పూర్తయ్యాక సరైన జాగ్రత్తలు తీసుకుంటేనే విత్తనాలు నాణ్యత కలిగి పనికి వస్తాయి. లేదంటే పుచ్చుపట్టి పనికి రాకుండా పోతాయి. వేరుశనగలో కోసిన పంటను తగిన తేమ (9 శాతం) వచ్చే వరకు మొక్క నుంచి కాయలను వేరు చేయడానికి ముందు ఎండబెట్టాలి. మెట్ట ప్రాంతంలో ప్రస్తుతం వేరుశనగ పంటను భద్రపరుచుకునే పనిలో రైతులు ఉన్నారు. వేరుశనగ విత్తనాలను భద్ర పరుచుకుని వచ్చే పంటకు ఉపయోగించుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి.నాగకుమార్ రైతులకు సూచిస్తున్నారు.

వేరుశనగ ఎండబెట్టే విధానం

ఇది రెండు రకాలుగా చేయవచ్చు. వేరుశనగ కాయల పైభాగానికి వచ్చేటట్లు చెట్లను చిన్న, చిన్న కుప్పలుగా వేయాలి. లేదా మొక్కలను కర్రలకు కట్టి కాయలను పక్కలకు వచ్చేటట్లుగా చేసి ఎండబెట్టుకోవచ్చు.



మెట్ట ప్రాంతంలో వేరుశనగ పంట



భూమి నుంచి పీకుతున్న వేరుశనగ మొక్కలు



బి నాగకుమార్, సహాయ వ్యవసాయ సంచాలకులు

తేమశాతం తగ్గించడం ఇలా

కాయల్లో తేమశాతం ఎక్కువగా ఉంటే ఎండలో ఆరబెట్టకుండా తేమను 7, 8 శాతానికి తీసుకురావచ్చు. వేడి గాలులను వదిలే పరికరాలను ఇందుకు ఉపయోగించవచ్చు. వేరుశనగ పంటను నిల్వ చేయడానికి ఒకసారి వాడిన సంచులను మళ్లీ వాడకూడదు. పాలిథిన్ పేపర్ ఉన్న గోనె సంచులు బాగా ఎండిన వేరుశనగ కాయలను నిల్వ చేయడానికి ఉపయోగం.

ఎండలో ఆరబెట్టకూడదు

రబీ కాలంలో మొక్కలు పీకేటప్పుడు వాతావరణం ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే ఎక్కువ ఉంటుంది. కాబట్టి కాయలను నేరుగా ఎండలో ఆరబెట్టకూడదు. నీడలో ఆరబెట్టాలి. లేదా ఎండ తీవ్రత ఉదయం 11 గంటల వరకు సాయంత్రం 4 గంటల తరువాత తక్కువగా ఉంటుంది. కాబట్టి ఆయా సమయాల్లో ఆరబెట్టుకోవాలి. ఎండబెట్టే సమయంలో వేరే రకాల కాయలు కలవకుండా చూసుకోవాలి.

కాయలను నిల్వ చేసుకునే విధానం

వేరుశనగ విత్తనం కోసం బాగా ముదిరిన కాయలను నిల్వ చేసుకోవాలి. కాయలను కదిలిస్తే ఘల్లుమని శబ్దం రావాలి. అప్పుడే బాగా ఎండినట్లు అర్థం. కాయలను నిల్వ చేసుకోవడానికి శుభ్రమైన లోపల పాలిథిన్ లైనింగ్ ఉన్న గోనె సంచులను వాడాలి. గోనె సంచులను 0.5 శాతం మలాథియాన్ ద్రావణంలో ముంచి బాగా ఆరబెట్టుకోవాలి. దీని వల్ల కాయల్లోని గింజలకు శిలీంద్రాల బెడద ఉండదు.

సేంద్రియ సాగుతో ఆరోగ్యకర ఉత్పత్తులు

- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి
- ఆకుతీగపాడు పొలంబడిలో రైతులతో మమేకం
- డ్రోన్ ద్వారా పిచికారీ, వరిపొలాల పరిశీలన



ఆకుతీగపాడు పొలంబడిలో రైతులతో మమేకమైన జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, అధికారులు

పెంటపాడు: ప్రభుత్వం రైతుల కోసం నిర్వహిస్తున్న పొలంబడుల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకుని ఆరోగ్యకరమైన పంటలు పండించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం పెంటపాడు మండలంలోని ఆకుతీగపాడు గ్రామంలో క్లస్టర్ పొలంబడి కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులతో మమేక మయ్యారు. సుమారు ఒక గంట సమయం రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. సేంద్రియ పద్ధతిలో పంటలు పండించడం ద్వారా రాబోయే తరాలకు ఆరోగ్యకర ఆహారాన్ని అందించవచ్చన్నారు. వరి, ఉద్యాన పంటలు, ఆరుతడి పంటలు కాయగూరలతో పాటు, అన్ని ఉత్పత్తులు సహజసిద్ధంగా పండించడం ద్వారా వాటిలో విషతుల్యం లేకుండా కాపాడుకోవచ్చన్నారు. తద్వారా ఇక్కడ రైతు అంతర్జాతీయంగా కీర్తి గడించవచ్చన్నారు. వరి నారుమడుల నుంచి పంట విక్రయం వరకు రైతులు తీసుకునే ప్రతి నిర్ణయం లాభసాటిగా, సేంద్రియ పద్ధతిలో ఉండేలా రైతులకు వ్యవసాయశాఖ మంచి విజ్ఞానాన్ని అందించాలన్నారు. పొలంబడులలో గ్రహించిన విజ్ఞానం సాగులో ఉపయోగపడాలన్నారు. విత్తనశుద్ధి, యంత్ర పరికరాల వాడకం, తెగుళ్ల నివారణకు జీవామృతం, ఆగ్నేయాస్త్రం వాడకంపై రైతులు వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు అందించే సూచనలు సలహాలు కచ్చితంగా పాటించాలన్నారు. ఈ సందర్భంగా రైతులు ఇప్పటివరకు తెలుసుకున్న వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వరి పొలాలను పరిశీలించారు. డ్రోన్ సాయంతో జీవామృతం పిచికారీని పరిశీలించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, మండల అధ్యక్షులు కట్టుబోయిన కృష్ణప్రసాద్ తదితరులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. డీఏవో జెడ్.వెంకటేశ్వర్లు, గూడెం ఏడీఏ పి.మురళీకృష్ణ, ఏవో పార్థసారథి, సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొణతాల వెంకట్రావు, రైతులు వీరాబత్తుల సత్యనారాయణ, వీరన్న, చింతల నాగరాజు, జాలపర్తి, పార్టీ నాయకులు నిమ్మల పెదకాపు, వ్యవసాయశాఖ వీఏఏలు, మార్టేరు, వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయశాఖ అధికారులు, ఆకుతీగపాడు రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి తాపీ కూలీ దుర్మరణం



పాలూరి అన్వేష్

పాలకోడేరు : విద్యుదాఘాతానికి గురై ఓ తాపీ కూలీ దుర్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి. విస్సాకోడేరులోని ఫోర్ నంబర్ పేటలో నివాసం ఉంటున్న పాలూరి అన్వేష్ (28) తాపీ కూలీగా పనిచేస్తున్నాడు. బుధవారం తన ఇంట్లో మరో వ్యక్తి అప్పన్నతో కలిసి తాపీ పనులు చేస్తుండగా గది చీకటిగా ఉందని బల్బు ఏర్పాటు చేసే ప్రయత్నంలో విద్యుత్ తీగలు తగిలి అన్వేష్, అప్పన్న షాక్‌కు గురయ్యారు. ఈ ప్రమాదంలో అన్వేష్ పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో వెంటనే స్థానికులు అతనిని భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామంలో విషాదఛాయలు

అన్వేష్ మృతితో విస్సాకోడేరులో విషాదఛాయలు అలుముకున్నాయి. అతని భార్య మొదటి కాన్పులో కవల ఆడపిల్లలను కనగా, మూడు నెలల క్రితం రెండో కాన్పులో ఆడపిల్ల పుట్టింది. ఆడపిల్లలను కష్టపడి పెంచుతానంటూ భార్య ధనలక్ష్మికి ధైర్యం చెప్పిన అన్వేష్.. అంతలోనే దూరం కావడంతో ముగ్గురు చిన్నారులు అనాథలయ్యారంటూ బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

డ్రిప్లవర్ టెక్నాలజీపై శిక్షణతో ఆర్థిక స్వావలంబన



డ్రిప్లవర్ టెక్నాలజీపై అంతర్జాతీయ శిక్షణను పూర్తి చేసుకున్న బంగ్లాదేశ్ బృందంతో వర్సిటీ వీసీ టి.జానకీరామ్

- బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రణాళిక ఉప కార్యదర్శి ఫిరోజ్ అల్ మమూన్
- ఉద్యాన వర్సిటీలో ముగిసిన అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమం

తాడేపల్లిగూడెం: భారత్ అంటే తమకెంతో ప్రేమ అని బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రణాళిక ఉపకార్యదర్శి ఫిరోజ్ అల్ మమూన్ అన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని ఉద్యాన పరిశోధనా స్థానంలో డ్రిప్లవర్ టెక్నాలజీపై తొలి అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా వెంకట్రామన్నగూడెంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో మమూన్ మాట్లాడుతూ భారతదేశాన్ని బంగ్లాదేశ్ ప్రజలు ఎంతో కృతజ్ఞతతో అభిమానిస్తారన్నారు. ఇక్కడకు శిక్షణకు రావడం, ఈ ప్రాంతాలను సందర్శించడం సంతోషంగా ఉందన్నారు. అద్భుతమైన నైపుణ్యాలను సంపాదించుకున్న ఇక్కడి గ్రామీణ మహిళలను కలువడం ఆనందంగా ఉందన్నారు. డ్రిప్లవర్ టెక్నాలజీ, ఇతర విషయాలపై చక్కని శిక్షణను తొమ్మిదిరోజుల పాటు అందించిన వీసీ టి.జానకీరామ్‌కు ధన్యవాదాలు తెలిపారు. బంగ్లాదేశ్‌లో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నది తమ ప్రధాని ఆకాంక్ష అన్నారు. ఈ కారణంతోనే మహిళలను శిక్షణ కోసం ఇక్కడకు పంపించారన్నారు. ఇక్కడ శిక్షణలో నేర్చుకున్న అంశాలపై బంగ్లాదేశ్‌లో యూనిట్స్ ప్రారంభిస్తామన్నారు. ఉద్యాన వర్సిటీ ఉపకులపతి జానకీరామ్ మాట్లాడుతూ వర్సిటీ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమం ఒక మైలురాయి అన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మరిన్ని శిక్షణలు నిర్వహిస్తామన్నారు. వాడిన పువ్వులను ఆదాయ వనరులుగా మార్చుకోడానికి వర్సిటీ మహిళలకు ఇచ్చిన శిక్షణ సాఫల్యం చెంది, టీటీడీతో ఒప్పందానికి, వందలాది మంది మహిళలకు శిక్షణ ఇవ్వడానికి అవకాశం వచ్చిందన్నారు. డ్రిప్లవర్ టెక్నాలజీ, ఇక్‌బనా, పూలదండల తయారీ, అలంకరణ విధానాలు నేర్చుకోవడం సంతృప్తినిచ్చిందని బంగ్లాదేశ్ మహిళలు చెప్పారు. వర్సిటీ ఇచ్చిన ఆతిథ్యం మరువలేమన్నారు. మళ్లీ ఇక్కడకు రావాలనుకుంటున్నామన్నారు. షేర్ ఏ బంగ్లా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ అబుల్ ఫైజ్ మహ్మద్ జమాలుద్దీన్, బంగ్లాదేశ్ ప్రభుత్వ వాణిజ్య విభాగ అధికారి ఎం.షాబుద్దీన్ పాల్గొన్నారు. వర్సిటీ అధికారులకు జ్ఞాపికలు అందజేశారు.

హక్కులపై అవగాహనతోనే చైతన్యం



వినియోగదారుల కమిషన్ సభ్యులను సత్కరించిన దృశ్యం

ఏలూరు (మెట్రో): వినియోగదారుల ప్రయోజనాన్ని పరిరక్షించేందుకు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండటం అందరి బాధ్యత అని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సత్యనారాయణరాజు అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవ సభలో ఆయన మాట్లాడారు. మారుతున్న అవసరాల దృష్ట్యా వినియోగదారుల రక్షణ చట్టంలో సవరణల ద్వారా వినియోగదారులకు సాధ్యమైనంత సత్వర న్యాయం అందించే వీలు కలిగిందన్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడంలో ఎప్పుడూ పౌర సరఫరాల శాఖ సంసిద్ధంగా ఉంటుందన్నారు. ముఖ్య అతిథి జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యురాలు వి.శ్రీనాగలక్ష్మి మాట్లాడుతూ వస్తువుల నాణ్యత ఇతర వివరాలను తెలుసుకునే హక్కు ప్రతి వినియోగదారుడికి ఉందన్నారు. బీమా పథకాలపై వినియోగదారుల అవగాహన ఎంతో అవసరం అన్నారు. వంటగ్యాస్ ప్రమాదంలో దురదృష్టవశాత్తు మరణించినా, ఆస్తినష్టం జరిగినా బీమా నష్టపరిహారం అందుతుందన్నారు. వార్షిక ఆదాయం తక్కువ ఉన్న వారు పిల్లల చదువు నిమిత్తం తీసుకునే రుణాలపై వడ్డీ రాయితీ గురించి ముందస్తుగా బ్యాంకర్లను అడిగి తెలుసుకోవాలన్నారు. జిల్లా వినియోగదారుల సంఘం ప్రతినిధులు కట్టా సత్యనారాయణ, కె.రామచంద్రరావు, డా.విజయకృష్ణ తదితరులు మాట్లాడుతూ వినియోగదారుల్లో అవగాహన వల్లే వస్తు సేవల నాణ్యత పెరుగుతుందన్నారు. వినియోగదారుల వివాదాల పరిష్కార వేదికలను ఆశ్రయించి సత్వర న్యాయం పొందవచ్చన్నారు. వినియోగదారుల హక్కులపై అవగాహనతోనే చైతన్యం కలుగుతుందన్నారు. తూనికలు కొలతలు శాఖ డిప్యూటీ కంట్రోలర్ హరిప్రసాద్, డీసీటీఓ జే శ్రీనివాసరావు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డి.సునీత, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కె.రామరాజు, విద్యుత్ డిప్యూటీ డీఈ ప్రసాద్ పలు అంశాలను వివరించారు. అనంతరం జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యురాలు వి.శ్రీనాగలక్ష్మి, జిల్లా వినియోగదారుల సంఘం ప్రతినిధులు కట్టా సత్యనారాయణ, కె.రామచంద్రరావు,డా.విజయకృష్ణలను సత్కరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ డి.ఆశ, పౌర సరఫరాల శాఖ డీఎం మంజూభార్గవి, కాలుష్యనియంత్రణ మండలి ఈఈ కె.వెంకటేశ్వరరావు, ఎల్‌డీఎం ఎస్ఎస్ఏ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుపై రెండోసారి విజిలెన్స్ దాడి

- రూ.13.78 లక్షల విలువైన 73.95 టన్నుల పీడీఎస్ రైస్ స్వాధీనం
- గుండుగొలనులో గాయత్రీ ట్రేడర్స్ మిల్లుపై విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారుల తనిఖీలు



గుండుగొలనులో రైస్‌మిల్లుపై దాడిలో రేషన్ షాపుల నుంచి నేరుగా వచ్చిన గన్ని బ్యాగుల్లోని రైస్

భీమడోలు: గుండుగొలనులోని గాయత్రీ ట్రేడర్స్ రైస్‌మిల్లుపై విజిలెన్స్, పౌరసరఫరాల విభాగం అధికారులు మంగళవారం రాత్రి రెండోసారి ఆకస్మిక దాడి చేసి నిబంధలకు విరుద్ధంగా రూ.13,78,260 విలువైన 73.95 టన్నుల పీడీఎస్ రైస్ బస్తాలను స్వాధీనం చేసుకుని రైస్ మిల్లును సీజ్ చేసారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరణం కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సీఐ విల్సన్, ఎస్సై సీహెచ్ రంజిత్ కుమార్, జిల్లా డీఎస్‌వో ఆర్ఎస్ఎస్ సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో అధికారుల బృందం దాడి చేశారు. ఈ రైస్ మిల్లుపై 20 రోజుల వ్యవధిలో దాడి చేయడం ఇది రెండోసారి. రైస్ మిల్లు యాజమాని బాదర్వాడ పృధ్వీరాజుపై 6(1), 7(1) కేసులను నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. గుండుగొలనులోని ఈ రైస్ మిల్లుకు గత డిసెంబర్ వరకు ధాన్యం కొనుగోలు, మర ఆడించేందుకు అనుమతులున్నాయి. అయితే నిబంధనలు పట్టించుకోకపోవడంతో ఈ రైస్ మిల్లుకు అనుమతులను రద్దు చేశారు. అయినా ప్రజాపంపిణీ బియ్యాన్ని మధ్యవర్తుల ద్వారా కొనుగోలు చేసి పాలిష్ చేసి వేరే సంచుల్లో నింపి అక్రమంగా కాకినాడకు తరలించే ప్రయత్నాలు చేస్తున్నాడు. గత నెల 21వ తేదీన ఇదే రైస్‌మిల్లులో పీడీఎస్ రైస్‌ను పాలిష్ చేసి వేరే ప్రాంతాలకు తరలిస్తుండగా రూ.7.74లక్షల విలువ గల 43 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడం తెలిసిందే. రెండు రోజుల కితమే మళ్లీ అనుమతులు పొందాడు. అయినప్పటికీ మిల్లు యాజమాని పృధ్వీరాజ్ మళ్లీ రేషన్ షాపుల నుంచి గన్ని బ్యాగుల్లో ఉన్న పీడీఎస్ రైస్‌ను నేరుగా కొనుగోలు చేశాడు. వాటిని మరలా పాలిష్ చేస్తున్నాడు. సమాచారం అందుకున్న పౌరసరఫరాల విభాగం, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక దాడి చేశారు. పీడీఎస్ రైస్‌ను కొనుగోలు చేసి కాకినాడలోని లెవిన్ ఇండ్రస్ట్రీస్‌కు రవాణా చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ సమయంలో ఆకస్మిక దాడి చేసి మిల్లులో 162 సంచుల్లోని 8.1 టన్నుల పీడీఎస్ రైస్‌ను పట్టుకున్నారు. వాటి విలువ రూ.1,45,800, అలాగే మరో 670 ప్లాస్టిక్ సంచుల్లోని 33.5 మెట్రిక్ టన్నుల రైస్ స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.6.03 లక్షలు. ఎటువంటి ఆధారాలు లేని 635 బస్తాల ధాన్యం 25.4 టన్నులు కాగా వాటి విలువ రూ.5,18,160. అలాగే రూ.76,300 విలువైన రంగు మారిన బియ్యం 5.45 టన్నులు, రూ.18వేల విలువ గల 1.5 టన్నుల చిరు నూకలను స్వాధీనం చేసుకున్నారు. రూ.12వేల విలువైన ఖాళీగా ఉన్న 600 గన్ని బ్యాగులు, ఎలక్ట్రికల్ కాటా రూ.5వేలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన రైస్, ధాన్యాన్ని ఏలూరులోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు లారీల్లో వాటిని తరలించారు. భీమడోలు సీఎస్‌డీటీ ఏ.మాధవరావు అధికారులకు సహకరించారు.

శాశ్వత లోక్ అదాలత్ ద్వారా కేసుల సత్వర పరిష్కారం

ఏలూరు (టూటౌన్): రాజీపడదగిన కేసుల సత్వర పరిష్కారానికి లీగల్ సర్వీస్ అథారిటీ కృషి చేస్తుందని శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి అన్నారు. ఏలూరు మండలం పాలగూడెం సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నూతనంగా శాశ్వత లోక్‌అదాలత్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో రవాణా సేవలపై, టెలిఫోన్, విద్యుత్తు, పారిశుద్ధ్యం, ఆసుపత్రులు, ఇన్సూరెన్స్, ఎన్ఆర్ఈజీఎస్, బ్యాంకు లావాదేవీలపై, విద్యా విషయాలు, రియల్‌ఎస్టేట్ సమస్యలు వంటి వాటిపై శాశ్వత లోక్‌అదాలత్‌ను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవచ్చునన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి మాట్లాడుతూ క్రిమినల్ కేసుల్లో అరెస్టుకు ముందుగా కూడా ఉచిత న్యాయ సహాయం లభిస్తుందన్నారు. ఈ నెల 18న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా కుటుంబ వివాదాలు వినియోగదారుల ఫోరానికి సంబంధించిన, ఐపీఆర్ కేసులపై ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.సునీత, ఉప సర్పంచ్ తూతా నిరంజన్, ఏలూరు డిప్యూటీ తహసీల్దార్ చలపతిరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇకెబనా రిక్కా స్టైల్

ఫ్లవర్ పారడైజ్.. ఇకెబనా

అబ్బురపరిచే సొబగులతో కొత్త అందాలను సంతరించుకుని వివిధ రంగులలో పూల అందాలు సాక్షాత్కరిస్తే కనువిందే. అయితే జపాన్ దేశంలో పూల అలంకరణ అనేది ఒక సంప్రదాయ కళ. దీనినే ఇకెబనా అంటారు. జపాన్ దేశంలో ఆలయాల అలంకరణలలో శతాబ్దాల క్రితం నాటి ఈ కళను ఇప్పటికీ ఆచరిస్తున్నారు. ఇన్నోవేటివ్ లివింగ్ ఆర్ట్‌గా 50 సంవత్సరాల నుంచి ప్రాచుర్యం పొందిన ఈ కళ సొంత పుష్ప విద్యగా, దిఆర్ట్ ఆఫ్ ఎరేంజింగ్ ఫ్లవర్స్‌గా, స్వర్గపు అందాలను పూల రూపాలలో (ప్యారడైజ్) చూపించే క్రమంలో ఇకెబనాలో రిక్కా స్టైల్ గణతికెక్కింది. ఢిల్లీకి చెందిన హేమపాఠక్ భారతదేశంలో ఇకెబనా కళకు ప్రాచుర్యం కల్పిస్తున్నారు. బంగ్లాదేశ్ నుంచి డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి వచ్చిన మహిళలకు వెంకట్రామన్నగూడెంలో ఈ కళపై ప్రత్యేక తర్ఫీదును ఇచ్చారు. త్వరలో ఉద్యానవర్సిటీలో సర్టిఫికెట్ కోర్సుగా ఇకెబనా కళను తీసుకురానున్నారు.

– తాడేపల్లిగూడెం









ఇకెబనా సొబగులతో బంగ్లా మహిళలు

క్లుప్తంగా

ఆధ్యాత్మిక శక్తిని పొందాలి



గూడెం ఎగ్జిబిషన్ సెంటర్‌లో సమావేశానికి హాజరైన విశ్వాసులు

పెంటపాడు: క్రీస్తు ప్రభుని శిలువ మార్గాన్ని అనుసరించే విశ్వాసికి ఆయన ప్రభావం వెల్లువలా ప్రవహిస్తుందని గుంటూరుకు చెందిన బైబిలు మిషను అధ్యక్షుడు డా.జె.శ్యామేల్ కిరణ్ పేర్కొన్నారు. గూడెం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బుధవారం రాత్రి బైబిలు మిషను సంఘం ఆధ్వర్యంలో క్రీస్తుని శిలువ ప్రభావ వెల్లువ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శామ్యూల్ కిరణ్ దేవుని వాక్యాన్ని బోధించారు. యేసుక్రీస్తు శిలువ శ్రమకాలాలు పురస్కరించుకొని ఆధ్యాత్మిక సందేశం అందించారు. బైబిలు మిషను ప్రతినిధులైన నలుగురు అధికారులతో పాటు, పాలకవర్గ సభ్యులు, రాష్ట్రం నలుమూలల నుంచి బైబిల్ మిషను రెవరెండ్ అధికారులు, పాస్టర్లు, స్థానిక సంఘ కాపరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రయాణికుల కోసం గ్రీన్ షెల్టర్స్ ఏర్పాటు



పట్టణంలో గ్రీన్ షెల్టర్స్ ఏర్పాటు చేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి తీవ్రత కారణంగా ప్రయాణీకులకు ఎండ తగలకుండా ఉండేందుకు కలెక్టర్ ఆదేశాలు మేరకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం గ్రీన్ షెల్టర్స్ ఏర్పాటు చేశారు. ఎన్‌టీఆర్ బొమ్మ, పోలీస్ ఐలాండ్ సమీపంలో తణుకు, ఏలూరు రూట్లల్లో గ్రీన్ షెల్టర్స్ ఏర్పాటు చేశారు. అంతేగాక షెల్టర్ల వద్ద తాగు నీటి సౌకర్యం అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బాల స్వామి, ఎంఈ మురళీకృష్ణ, ఇంజనీరింగ్ సిబ్బంది పర్యవేక్షించారు.

మహిళలందరూ విద్యావంతులు కావాలి

తణుకు టౌన్: ప్రతి మహిళా విద్యావంతురాలైతే సమాజం వేగంగా అభివృద్ధి సాధిస్తుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కె.కుమారి తెలిపారు. తణుకు మండలంలోని వేల్పూరు, దువ్వ, తేతలి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల ముగింపు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. దువ్వ గ్రామంలోని 123 అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో గర్భిణులు, కిషోరీ బాలికలు, బాలింత మహిళలకు ఆరోగ్య సమస్యలపై వివరించారు. తేతలి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బాలికల వివాహ వయస్సు గురించి వివరించారు. మైనర్ బాలికలకు వివాహం చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటారని వివరించారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, డ్వాక్రా సభ్యులతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

ఆకుతీగపాడులో చలివేంద్రం ప్రారంభం



ఆకుతీగపాడులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ

పెంటపాడు: ఆకుతీగపాడు గ్రామంలో రావి చెట్టు వద్ద బుధవారం జిల్లా ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ గ్రామస్తులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలైన కైగాల శ్రీనివాస్, నిమ్మల పెదకాపు, సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ కొల్లూరి పండు తదితరులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వేసవి పూర్తయ్యే వరకు ప్రజలకు ఈ చలివేంద్రం ద్వారా నిరంతరాయంగా బాటసారుల దాహార్తి తీర్చేందుకు తాగునీరు అందించాలని కోరారు.

పెంటపాడులో ఫ్యామిలీ ఆరోగ్య పరీక్షలు



పెంటపాడు అంగన్‌వాడీ కార్యాలయం వద్ద ఆరోగ్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

పెంటపాడు: వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో భాగంగా బుధ వారం పెంటపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని పెంటపాడు గ్రామంలో రోగులకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ తోట రాజేష్ ఆధ్వర్యంలో అంగన్వాడీ చిన్నారులు, గ్రామంలో వృద్ధులు, మహిళలు, దీర్ఘకాలిక రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ ప్రారంభించారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహణ
- వెనుకబడిన సబ్జెక్ట్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

అత్తిలి: విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. దీంతో గతేడాది కన్నా మెరుగైన ఫలితాలను తీసుకురావాలనే లక్ష్యంతో విద్యార్థులను ఏ,బీ,సీ,డీ కేటగిరీలుగా విభజించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అత్తిలి మండలంలో 10 ఉన్నత పాఠశాలలు, మూడు ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 492 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సిద్ధమౌతున్నారు. ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశారు. పరీక్షలకు మరో పక్షం రోజులు మాత్రమే సమయం ఉండటంతో విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదునిస్తున్నారు. గతేడాది కంటే మంచి ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయ బృందం కృషి చేస్తున్నారు. ఇప్పటికే సిలబస్ పూర్తికావడంతో రివిజన్ క్లాసులు ఏర్పాటు చేసి, ఏరోజుకారోజు సంబంధిత పాఠ్యాంశాలపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు సబ్జెక్టుల్లో తలెత్తిన సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటున్నారు. ప్రత్యేక తరగతులు తమకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని విద్యార్థులు పేర్కొంటున్నారు.



అత్తిలి మండలం బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం...



పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రణాళికా బద్ధంగా చదివించి, విద్యార్థులను మానసికంగా సిద్ధం చేస్తున్నాం. మంచి ఉత్తీర్ణతశాతం సాధించడానికి మా ఉపాధ్యాయ బృందం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

వైఎస్సార్‌సీఎం దత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జడ్పీ ఉన్నత పాఠశాల, బల్లిపాడు, అత్తిలి మండలం.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు



పదో తరగతి పరీక్షలకు సమీపిస్తున్న తరుణంలో ఉపాధ్యాయులు మా చదువులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. సాయంత్రం సమయంలో సబ్జెక్టుల వారీగా తరగతులు నిర్వహిస్తున్నారు. గ్రేడులు వారీగా విభజించి, క్లాసులు చెబుతున్నారు. సబ్జెక్టులపై మాకు ఉన్న సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

గూడూరి తేజారామ్, పదో తరగతి విద్యార్థి, జడ్పీ హైస్కూల్, బల్లిపాడు,అత్తిలి మండలం

మంచి మార్కులు తెచ్చుకోవడానికి కృషి చేస్తున్నా



పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి కృషిచేస్తున్నా. ప్రత్యేక తరగతుల్లో ఉపాధ్యాయులు పాఠ్యాంశాన్ని అర్ధమయ్యే రీతిలో ఒకటికి రెండుసార్లు వివరించి మానుంచి జవాబులు రాబడుతున్నారు. ప్రత్యేక తరగతుల వల్ల సందేహాలను నివృత్తి చేసుకుంటున్నాం.

తోట తేజస్విని, , పదోతరగతి విద్యార్థిని, జడ్పీ హైస్కూల్, బల్లిపాడు,అత్తిలి మండలం

శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



పెంటపాడు పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలతో సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: పరిశుభ్రతతోనే ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని గూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వీ లక్ష్మణరావు పేర్కొన్నారు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించే కార్యక్రమంలో భాగంగా పెంటపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో బుధవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సబ్ సెంటర్లలో ఆరోగ్య పరిస్థితి, చేపడుతున్న డ్రైడే, ఫీవర్ సర్వే కార్యక్రమాలను సమీక్షించారు. డాక్టర్ తోట రాజేష్, మెడికల్ అధికారి వి.మౌనిక తదితరులు పలు గ్రామాల్లో బుధవారం పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిమెళ్ల, యానాలపల్లి, కె. పెంటపాడు గ్రామాల్లో ఫీవర్ సర్వే చేశారు. నీటిని వృధా చేయకుండా, మురుగునీరు లేకుండా చూసుకోవాలన్నారు. దోమతెరలు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా, పలు గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ పనులు త్వరగా చేపట్టాలి

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పీ శ్రీనివాసరావు



అమృత్ సరోవర్ పథకంపై నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

తణుకు టౌన్: అమృత్ సరోవర్ పథకంలో చేపట్టే మంచినీటి చెరువుల ఆధునీకీకరణకు సంబంధించి మండలాల్లోని గ్రామాల్లో ఇంకా గ్రామ సభలు తీర్మాణాలు, అంచనాలు తయారు చేయకపోవడం ఏంటని జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బందిని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పీ శ్రీనివాసరావు నిలదీశారు. బుధవారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో తణుకు నియోజకవర్గ స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పనుల పురోగతిపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అమృత్ సరోవర్ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. అత్తిలి మండలంలో అమృత్ సరోవర్ పథకం కింద మొత్తం 15 చెరువులను గుర్తించి అభివృద్ధి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ గ్రామ సభల తీర్మాణాలు, అంచనా ప్రతిపాదనలు ఇప్పటి వరకూ ఎందుకు చేయలేదని ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందిని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లో అత్తిలి మండలంలో 15 గ్రామాల్లో మంచి నీటి చెరువులను, ఇరగవరం మండలంలో 12 చెరువులను, తణుకు మండలంలో 7 చెరువులను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులను కోరారు. ఈ పథకంలో చెరువుల సుందరీకరణ పనులను గ్రామ పంచాయతీ నిధులు, లేక 15వ ఆర్థిక సంఘం నిధులను ఉపయోగించాలని తెలిపారు. ఈనెల 18న జరిగే సమావేశానికి పూర్తి సమాచారంతో హాజరు కావాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



తణుకు ఎస్ఎన్‌వీటీ జూనియర్ కళాశాల వద్ద పరీక్ష గది వివరాలను చూసుకుంటున్న విద్యార్థులు

తణుకు టౌన్: ఇంటర్మీడియట్ పరీక్షలు తణుకులో బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తణుకులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పట్టణంలోని ఏర్పాటు చేసిన 10ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును ఏర్పాటు చేశారు. విద్యార్థులకు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడంతో పరీక్షా కేంద్రాల వద్ద రద్దీ వాతావరణం నెలకొంది.

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు నియోజకవర్గంలో 8 సెంటర్‌ల్లో బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో శ్రీ వాసవి, ఆదిత్య, ప్రగతి, జీఎంఆర్, శశి, చైతన్య, గోయెంకా ఉమన్స్ కళాశాల, పెంటపాడు జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించారు. కేంద్రాలకు వచ్చిన విద్యార్థులను తనిఖీలు చేసి అనంతరం పరీక్ష హాల్‌లోకి అనుమతి ఇచ్చారు. తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలు, వోకేషనల్ పరీక్షలకు 2,456 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 2,363 మంది పరీక్షలు రాశారు. 93 మంది పరీక్షలకు హాజరు కాలేదు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



తిరుపతిపురంలో బాల్యవివాహాలు నిరోధక చట్టంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అత్తిలి: బాలికలలో శారీరక, మానసిక ఎదుగుదల లేకుండా వివాహాలు చేయడం చట్ట ప్రకారం నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. శ్రీదేవి అన్నారు. అత్తిలి మండలం బల్లిపాడు, తిరుపతిపురం గ్రామాల్లో బుధవారం బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి మాట్లాడుతూ బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి, జీవితంలో వివిధ రంగాల్లో ఉన్నత పదవుల్లో స్థిరపడాలన్నారు. బాలికలు అన్ని రంగాల్లో ముందుకువెళ్లి, తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాల్యవివాహాలు వల్ల కలిగే దుష్పరిణామాలు, బాల్యవివాహ నిరోధక చట్టం 2006, ఫోక్సోచట్టం 2012, ఫోక్సో సవరణచట్టం 2019పై అవగాహన కల్పించారు. కౌమార పిల్లల మానసిక, శారీరక స్థితులను వివరించారు. ఆడపిల్లకు 19 ఏళ్లు, మగపిల్లలకు 22ఏళ్ల వయస్సు వచ్చాక వివాహం చేసుకోవాలన్నారు. ప్రతి వివాహం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఎస్సై కేసీహెచ్ స్వామి, గ్రామ మహిళా సంరక్షణ అధికారిణిలు రాగసుధ, ఏఎన్ఎం అర్జునమ్మ, ఎమ్ఎల్‌హెచ్‌పీ సుగుణ, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రుచి, శుచి తప్పనిసరి



పెంటపాడు ప్రభుత్వ పోస్టుబేసిక్ స్కూల్లో జగనన్న గోరుముద్దను పరిశీలిస్తున్న కలెక్టర్

పెంటపాడు: పెంటపాడు ప్రభుత్వ పోస్టుబేసిక్ పాఠశాలలో మధ్యాహ్న భోజనమైన జగనన్న గోరుముద్దను జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి బుధవారం అకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ మెనూ వివరాలు, భోజనాల నాణ్యత, విద్యార్థుల సంఖ్య, ఎంతమంది భోజనం చేస్తున్నారు అనే విషయాలు ఉపాధ్యాయులు, విద్యార్థుల నుంచి అడిగి తెలుసుకొన్నారు. నాణ్యతను రుచిచూసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న గోరు ముద్ద నాణ్యత విషయంలో రాజీపడవద్దని తెలిపారు. మరుగుదొడ్లు, పరిసరాలు, నాడు- నేడులో చేపట్టిన పనుల వివరాలను డీఈవో ఆర్‌వెంకటరమణను, విద్యాశాఖ అధికారులను అడిగితెలుసుకొన్నారు. బహిరంగ మలవిసర్జన, పరిసరాల శుభ్రతపై విద్యార్థులకు విద్యాశాఖ అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ యం. సూర్యతేజ, ఆర్డీవో దాసి రాజు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, కట్టుబోయిన కృష్ణప్రసాద్, హెచ్ఎం ఏవీఎస్‌వీ ప్రసాద్, ఎంఈవో శ్రీనివాస్, తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, ఎంపీడీవో దామోదరరావు, వ్యవసాయశాఖ ఏడీఏ మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాతూరు యూత్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పాతూరు యూత్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. సంజీవనగర్ ప్రాథమిక పాఠశాలలో యూత్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు బిస్కెట్స్, కేక్‌లు, అదే విధంగా పేదలకు 10 కేజీల చొప్పున బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.

ప్రతిష్టాత్మకంగా భూముల రీ-సర్వే



వెంకట్రావుపాలెం గ్రామంలో డ్రోన్ సాయంతో రీ-సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని పుల్లాయగూడెం ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు అన్నారు. బుధవరం తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట, వెంకట్రావుపాలెం రెవెన్యూ పరిధిలో డ్రోన్ సహకారంతో భూముల రీ-సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు మాట్లాడారు. సర్పంచ్‌లు ఆరుగొల్లు శ్రీను, ఎలిపే గాంధీలు మాట్లాడుతూ డ్రోన్ సర్వేలో భూముల హద్దులు, డాక్యుమెంట్లు డిజిటలైజేషన్ అవుతాయన్నారు. భవిష్యత్‌లో ఎటువంటి వివాదాలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు అడపా హరిబాబు, మాధవ, నార్పరెడ్డి సూర్యనారాయణ, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్లు

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం న్యాయవాదుల బార్ అసోసియేషన్ 2023-24 ఎన్నికలకు సంబంధించి వివిధ పదవులకు పోటీదారులు నామినేషన్లను బుధవారం సమర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఎపిపి శిరిగినీడి విజయకృష్ణ, న్యాయవాదులు కర్రి అప్పిరెడ్డి, కాజా నాగేశ్వరరావులు నామినేషన్లు దాఖలు చేశారు. ఉపాధ్యక్ష పదవికి తోట మురళీకృష్ణ, బవిరిశెట్టి శేషు, కంకట శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ పదవికి దాసం సునీల్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. జాయింట్ సెక్రటరీకి దాసరి ఆకాంత్, కంకట శ్రీనివాసరావు, పిఎస్ రత్నారావు, క్రీడా సాంస్కృతిక విభాగ కార్యదర్శికి పమ్మి వీరబాబు, మాకా సత్యనారాయణ, లేడి రిప్రజెంటేటివ్‌కు మళ్లిడి గీతారెడ్డి, గ్రంథాలయ కార్యదర్శికి నందూరి స్వామి, కోశాధికారిగా అరిటాకుల దశరధరావు, కొత్తపల్లి ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా పీవీవీ సత్యనారాయణ, డిఎస్ఎస్ రవిప్రసాద్, వీఎస్ రాధాకృష్ణ, రామకృష్ణ, ఎం గోపాలరావు, యు శివ కుమార్, షేక్ బాషా నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల కమిషనర్లుగా వైఆర్‌కే పరమహంస, తోట వెంకటసత్యనారాయణ, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్ పీతల సుధాకర్, గుత్తికొండ శ్రీనివాసు వ్యవహరిస్తున్నారు. నామినేషన్లు ఈనెల 15వ తేదీతో ముగియడంతో ఈనెల 31న పోలింగ్ నిర్వహిస్తున్నట్లు ఎన్నికల కమిషనర్లు తెలిపారు.

మున్సిపల్ ప్రత్యేకాధికారిగా ఆర్డీఓ

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం మున్సిపల్ ప్రత్యేకాధికారిగా భీమవరం ఆర్డీఓ వ్యవహరించనున్నారు. ఇప్పటి వరకు మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా జాయింట్ కలెక్టర్ వ్యవహరించారు. ఆయన స్థానంలో భీమవరం ఆర్డీఓను ప్రత్యేకాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మే 5 వరకు ఆర్డీఓ ప్రత్యేకాధికారిగా ఉంటారు. తదుపరి ఆదేశాలకు అనుగుణంగా మిగిలిన చర్యలుంటాయి. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఈ మేరకు ఆదేశాలను ఇచ్చింది.

నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగుల నిరసన

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం 7వ రోజు ఉద్యోగులు భోజన విరామ సమయంలో తమ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రతి నెలా 1న జీతాలివ్వాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అలాగే నూతన పీఆర్‌సీ కమిటిని వెంటనే నియమించాలని కోరారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వృద్ధులకు సేవలను అందిద్దామని లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సభ్యులు పేర్కొన్నారు. డైమండ్స్ క్లబ్ వారిచే బుధవారం పడాల వృద్ధా శ్రమంలో క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్ వేగేశ్న రామరాజు సౌజన్యంతో వృద్ధులకు అన్నదానం చేశారు. వశిష్ట లియో క్లబ్ డైరెక్టర్ బి.బాలశివ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో బీసీఏ డిగ్రీ కోర్సు

తణుకు టౌన్: తణుకులోని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో బీసీఏ డిగ్రీ కోర్సును (బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్) 2023-24 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఆదికవి నన్నయ యూనివర్సిటీ నుంచి అనుమతులు అందినట్లు తెలిపారు. ప్రస్తుతం ఐటీ రంగంలో ఉన్న పోటీ కారణంగా ఈ కోర్సు ద్వారా విద్యార్థునులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కె రామకృష్ణ తెలిపారు.

ఆర్‌బీకేల్లో ఈ-క్రాప్ జాబితా ప్రచురణ



ఈ-క్రాప్ జాబితాలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని 27 రైతు భరోసా కేంద్రాల్లో బుధవారం ఈ-క్రాప్ జాబితాను ప్రచురించినట్లు మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ తెలిపారు. బుధవరం మండలంలోని నందమూరు, ఆరుగొలను రైతు భరోసా కేంద్రాలను ఆయన సందర్శించి, రైతులతో మాట్లాడారు. ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన ఈ-క్రాప్ జాబితాను సరి చూసుకోవాలని, ఏవైనా తప్పులు ఉంటే ఆర్‌బీకే ఇన్‌ఛార్జ్‌కి తెలియజేయాలన్నారు. ఈ నెల 17వ తేదిలోపు తప్పులు సరి చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆర్‌బీకే ఇన్‌ఛార్జ్‌లు జె.సతీష్, టి.ప్రవీణ్, దానయ్య, సత్యనారాయణ, రఘునాథం, నార్ని శంకరరావు, అడపా శ్రీను, వీఆర్వోలు మోహన్, శాంతిరత్నం ఉన్నారు.